క్లుప్తంగా

పక్కాగా ఓటరు సర్వే



మాట్లాడుతున్న ఏపీవో రోసిరెడ్డి

సీతంపేట: ఓటరు సర్వే పక్కాగా చేయాలని ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి అన్నారు. నియోజక వర్గ పరిధిలోని నాలుగు మండలాల బీఎల్‌వోలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదన్నారు. బీఎల్‌వోలు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేసి ఓటర్ల జాబితాలో తప్పిదాలను సరి చేయాలన్నారు. ఒక కుటుంబంలోని వారంతా ఒక పోలింగ్ స్టేషన్‌లో ఉండాలన్నారు. ఫార్మ్ – 8 ద్వారా తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి



గిరిజన రైతులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భామిని: మండలంలోని మనుమకొండలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై గురువారం అవగాహన కల్పించారు. గోమాతల మూత్రాలతో తయారు చేసిన కషాయాలతో ప్రకృతి సాగుతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. కషాయాలు తయారు చేసి అవగాహన కల్పించారు. సర్పంచ్ నిమ్మల కేశవ, వెలుగు ప్రతినిధులు శైలజ, రామారావు, ఏపీసీఎస్ఎఫ్ సీఆర్‌పీలు, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉషారాణి



ఉషారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఎస్.ఉషారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన హరికృష్ణ బదిలీపై శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు బదిలీపై వెళ్లగా కామర్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఉషారాణి ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈమెను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురుదత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి తదితర పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీజైగురుదత్త హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చరిత్రలో నిలిచేలా జగనన్న సంక్షేమ పాలన

● ఎమ్మెల్యే కళావతి



గడప గడపకు కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: చరిత్రలో నిలిచేలా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పాలన నిలుస్తుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కొండాడ గ్రామ సచివాలయం పరిధిలోని కొండాడ, మేడ ఒబ్బంగి, ఇస్ప రాయి, లోవగూడ, లోవగూడ కాలనీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి?, ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వీలైనన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలు పథకాల అమలుతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకు వేసి అమ్మ ఒడి, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో 2,300ల వ్యాధులను చేర్చడాన్ని పేదలు మరిచిపోలేరన్నారు. తమ సంక్షేమ పాలనతో లక్షలాది కుటుంబాల్లో వెలుగు నింపిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. గడప గడపలో వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. కాలువలు, విద్యుత్ స్తంభాల మార్పు, మంచినీటి సమస్య, రహదారులు వంటి సమస్యలు పరిష్కారానికి ఏజెన్సీ పంచాయతీల్లో రూ.40 లక్షలు విడుదల అవుతాయన్నారు. గ్రామాల పరిధిలో పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ ముకుందరావు, రవి, ఎంపీటీసీ మంగయ్య, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎన్.కాంతారావు, ఎర్రయ్య, తవిటిరాజ్,తెల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు పాటుపడండి

● సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్



విద్యార్థులను ప్రశ్నిస్తూ జవాబులు రాబడుతున్న సబ్ కలెక్టర్

పాలకొండ రూరల్: ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కల్పిస్తున్న వసతుల సద్వినియోగపర్చుకుని పిల్లల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఎన్‌కే రాజపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాల్లో చోటుచేసుకున్న లోపాలు గుర్తించారు. ఈ తరహా నిర్వహణలో లోపాలు, పారిశుద్ధ్య సమస్యలు సరిచేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రస్తుత సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్య భద్రత, భోజన పథక నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల ప్రమాణాలపై ఆరా తీశారు. తరగతి గదిలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇటీవల అందించిన జగనన్న కిట్లు, నాడు – నేడు పనుల తాజా స్థితిగతులను పాఠశాల హెచ్‌ఎం ఎ.జీవమణిని అగిడి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో – 2 సీహెచ్ సోంబాబు, సహోపాధ్యాయులు ఉన్నారు.

30 శాతం చేపలు ఫిష్ ఆంధ్రాకే..



మత్స్యకారులకు సూచనలిస్తున్న ఎఫ్‌వో ఆదినారాయణ

భామిని: మండలంలోని బిల్లుమడ తామర చెరువు వద్ద వైఎస్సార్ మత్స్యసాగు బడి కార్యక్రమం మండల మత్స్యశాఖాధికారి కె.ఆదినారాయణ గురువారం నిర్వహించారు. మండల మత్స్యకార సంఘ అధ్యక్షుడు చెక్కా శ్రీను అధ్యక్షతన మత్స్యకారులకు చేపల పెంపకం, ఫీడ్ ఎంపికపై సూచనలు చేశారు. మత్స్యకారులు చెరువుల్లో పట్టే చేపలలో 30 శాతం చేపలు విధిగా ఫిష్ ఆంధ్రా షాపులకు అందివ్వాలని మత్స్య అధికారి ఆదినారాయణ సూచించారు. చెరువుల్లో విడిచిన చేప పిల్లల సంరక్షణపై సూచనలు చేశారు. నేరడి, బిల్లుమడ, నులకజోడు, బొమ్మిక గ్రామాల నుండి మత్స్యకారులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులను గుర్తించాలి



రైతులకు చర్చావేదిక నిర్వహిస్తున్న ఏఏ ఏలీసా

భామిని: మండలంలోని తాలాడలో ఘనసర ఏఏ గొర్లె ఎలీసా ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి గురువారం నిర్వహించారు. రైతులతో చర్చా వేదిక చేపట్టారు. సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి అధ్యక్షతన పంటల్లో వచ్చే చీడపీడలకు కారకులైన మిత్ర, శత్రు కీటకాలపై వివరించారు. అనంతరం వరిలో సస్యరక్షణ చర్యలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



మందు పిచికారీని పరిశీలిస్తున్న మండ సర్పంచ్ హైమావతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలోని టిక్కబాయి, ఎగువ మండ గ్రామాల్లో గురువారం దోమల వ్యాప్తి నివారణ కోసం ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన మండ సర్పంచ్ నిమ్మక హైమావతి మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో, చల్లగా ఉండే ప్రదేశాల్లో దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో దోమల నుంచి రక్షణ పొందాలంటే వాటి వ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్, కార్యదర్శి ఎం.షర్మిల, సూపర్‌వైజర్ అప్పలనాయుడు, ఆరోగ్య కార్యకర్త నిమ్మకూరి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వండి



మాట్లాడుతున్న తోట సింహాచలం

భామిని: గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వాలని ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, మండల ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వారి ఆధ్వర్యంలో సర్పంచులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అత్యవసరమైన వీధి కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల భవనాలు వంటి సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 5లోగా సమస్యలు వివరిస్తే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే కళావతి నిధులు మంజూరు చేయిస్తారని తెలిపారు. సమావేశంలో సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'భోజనం పరిశీలన



ఆదర్శ పాఠశాలలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ గురువారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. పాఠశాలలో నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించగా బియ్యం నిల్వలు ఒక క్వింటా 25 కేజీలు తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. సిబ్బందిని ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆయన వెంట సీఎస్‌డీటీ సాంబమూర్తి, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించాలి



పత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న భవిత సిబ్బంది

కురుపాం: దివ్యాంగ పిల్లలను భవిత పాఠశాలల్లో చేర్పించాలని ఐఈఆర్‌టీ సత్యవతి, ఐఈ డీఎస్ఎస్ శేఖర్ కోరారు. మండలంలోని పెదగొత్తిలి పంచాయతీ పరిధి కై రాడ, పెదగొత్తిలి, డంగులుగూడ గిరిజన గ్రామాల్లో ప్రత్యేక అవసరాల గల చిన్నారుల గుర్తింపునకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ గురువారం నిర్వహించారు. గుర్తించిన చిన్నారులను ప్రశస్త యాప్‌లో పొందుపరించారు. యాప్‌లో నమోదైన చిన్నారులకు ప్రభుత్వమే వైద్య సేవలు, సహాయక చర్యలు, సంక్షేమ పథకాలు సమకూర్చుతుందని అన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఎంఈవోలు



రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఎంఈవో వన్ ఆనందరావు

సీతంపేట: స్థానిక కేజీబీవీని ఎంఈవో వన్ ఆనందరావు, రెండో ఎంఈవో సూర్యచంద్రరావు సందర్శించారు. ఈ మేరకు తరగతి గదులకు వెళ్లి విద్యార్థినుల చదువులను పరిశీలించారు. అందరికీ పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, జేవీకే కిట్లు, యూనిఫారాలు అందాయా.. లేదో తెలుసుకున్నారు. సబ్జెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం మెనూ పరిశీలించారు. స్టాక్ రూం రిజిస్టర్లు చూశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.రూప, అకౌంటెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రబంధకులు

కురుపాం: ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో పలు రకాల పంటల సాగులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు ఎంతో మంచి సేవలు అందుతున్నాయని శ్రీవరి, శ్రీరాగి, గులిరాగి, చిరుధాన్యాలు, క్వినోవా, నాన్‌బీటికాటన్, అనంతపురం మోడల్ మొదలగు పంటలను, దేశి వరి వంగడాలు అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు. కేవీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కేవీకే ప్రోగ్రాం మేనేజర్ పాత్రో మాట్లాడుతూ రైతులకు నూతన వ్యవసాయ విధానాలను వినియోగించుకొనేలా అన్ని విధాలా ఉపయోగపడేలా కేవీకే చర్యలు చేపడుతుందని ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి కషాయాలు, ద్రావణాలు, జీవామృతాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సైంటిస్టు శ్రీనివాసరాజు, కన్సల్టెంట్ రమాప్రభ, ఎస్ఎఫ్ఏ అన్నపూర్ణ, ఫామ్ మేనేజర్ హరీష్, సీతారాం, నరేష్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

గండి పూడ్చివేతకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు



గండి పూడ్చివేత పనుల్లో రైతులు, అధికారులు

పాలకొండ రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాలకొండ మండలం భాసూరు గ్రామ సమీపంలో గల తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండి పడగా సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుతో ఇరిగేషన్ ఏఈ బి.శంకరరావు నేతృత్వంలో గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్థానిక రైతులు ఎస్.గురువినాయుడు, సుంకరి సింహాచలం, తిరుపతిరావు, వారాడ రాములనాయుడు తదితరుల సహకారంతో జేసీబీలను వినియోగించి గండి పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ శాశ్వత పద్ధతిలో ఈ పనులు చేపట్టాలన్నారు. ఈ కాలువ దిగువన దాదాపు 2వేల ఎకరాల్లో సేద్యం జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఐజీ భుజంగరావు, రామారావు, పెద్ద ఎత్తున స్థానిక రైతులు పాల్గొని గండి పూడ్చివేతలో సహకారం అందించారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్

సీతంపేట: ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు, వ్యాయామం, ఆటల పోటీలపై అవగాహన కల్పిస్తున్నట్టు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి వ్యాయామం తప్పనిసరి అన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉంటారని క్రీడల్లో రాణించవచ్చన్నారు. చదువులతో పాటు క్రీడలు అవసరమన్నారు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి వాటిపై కోచ్‌లు మెలకువలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రరావు, కోచ్‌లు రవి, రాజేష్, మధు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పనకు తన వంతు కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హామీ ఇచ్చారు. మండలంలోని మారుమూల ఉన్న పెదవంగర రహదారి నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 70 ప్రధాన రోడ్లు నిర్మించామన్నారు. ఇంకా ఏఏ గ్రామాలకు రహదారులు లేవో గుర్తించి వాటికి కూడా నిర్మాణం చేపడతామన్నారు. రహదారుల నిర్మాణంతో అత్యవసర సమాయాల్లో ఉన్న ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఆస్పత్రుకు రోగులను చేరవేయాలన్నా, మార్కెట్‌కు గిరిజనులు పండిస్తున్న అటవీ సంపదను తరలించాలన్నా గతంలో ఇబ్బందులు ఉండేవన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.రాము పాల్గొన్నారు.

మాతా, శిశు సంరక్షణపై అవగాహన

● నూర్ హెల్త్ ప్రోగ్రాం అసోసియేట్ సంజయ్



తల్లి మరియు నవజాత శిశువు సంరక్షణపై నర్సులకు అవగాహన కల్పిస్తున్న సంజయ్

గుమ్మలక్ష్మీపురం: మాతా, శిశు సంరక్షణపై అవగాహన కల్పించాలని నూర్ హెల్త్ ప్రోగ్రాం అసోసియేట్ సంజయ్ అన్నారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేర్ కేంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా తల్లి మరియు నవజాత శిశు సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి మాతా, శిశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవం అనంతరం ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏఏ ఆరోగ్య సలహాలు పాటించాలో తెలియజేస్తూ, ఆస్పత్రికి ప్రసవానికి వచ్చిన లేదా ప్రసవం పొందిన మహిళలకు అవగాహన కల్పించాలంటూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు దుర్గాప్రసాద్, ప్రతాప్, నవ్య, పావని, రాజన్ పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు



దేశూరుగెడ్డ నీటి ప్రవాహానికి నీట మునిగిన పంటపొలాలు

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. మండలంలోని రావుపల్లిలోని దేశూరుగెడ్డకు నీటి ప్రవాహం ఎక్కువగా రావడంతో పంట పొలాలు నీట మునిగాయి. అలాగే కొత్తపల్లి – రావుపల్లి ఆర్అండ్‌బీ రహదారిపైకి నీటి ప్రవాహం రావడంతో వాహనచోదకులు రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. దేశూరు గెడ్డ నీటి ప్రవాహనికి కొత్తపల్లి, పెద్దూరు గ్రామాలలోని పంట పొలాలు నీట మునిగాయి. పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

జగనన్న సురక్షతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం పలు చోట్ల సభలు నిర్వహించి అర్హులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: తంపటాపల్లిలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బొమ్మాళి భాను, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు



గుమ్మలక్ష్మీపురం: ఇరిడిలో లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ జి.రాములమ్మ, చిత్రంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు తదితరులు



పాలకొండ: ఎల్ఎల్‌పురంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జియ్యమ్మవలస: ఇటిక సచివాలయంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



వీరఘట్టం: ధ్రువపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ గౌరమ్మ, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు